
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
ఆదివారం 2 మార్చి 2025





	ఇఫ్తార్	సెహెరి
	ఆదివారం	సోమవారం
కర్నూలు	6: 31	5:13
నంద్యాల	6: 31	5:13



అహో.. సురభి


'సురభి' బృందంలోని కళాకారిణి



- కళా సౌరభం.. సురభి నాటకం
- కట్టిపడేసే నటనా రాజసం
- రెప్పపాటులో మారిపోయే సెట్టింగులు
- హాస్యం.. ఆహార్యం.. అద్భుత నటన ఆ కళాకారుల సొంతం

సురభి... తెలుగు రాష్ట్రాల ప్రజలకు పరిచయం అక్కర్లేని నాటక సమాజమిది. తరతరాల పాటు కళామతల్లి నొసటన తిలకమై మెరిసిపోతున్నారు. రాజసం ఉట్టిపడే నటన.. అద్భుత హావభావాలు.. కడుపుబ్బా నవ్వించే హాస్యం.. స్పష్టమైన డైలాగ్ డెలివరీ 'సురభి' కళాకారుల సొంతం. 'సురభి' వాళ్లు నాటకాలు వేస్తున్నారంటే... చుట్టుపక్కల పది పల్లెల నుంచి ప్రజలు బండ్లు కట్టుకుని వచ్చి మరీ వీక్షించేవారు. వేదికపై సురభి టీం ప్రదర్శనలు ఇస్తుంటే కనురెప్ప మూసి తెరిచేలోగా సెట్టింగులు మారిపోతాయి. రంగస్థలంపై భారీ సెట్టింగులు, రకరకాల తెరలు సైతం నాటకంలో భాగస్వామ్యం అవుతాయి. ఎన్నో సంభ్రమాశ్చర్యాలను కలిగించే దృశ్యాలు, సెట్టింగులు సురభి సమాజానికే సాధ్యమవుతాయి. వందేళ్లకు పైబడి పౌరాణిక, జానపద నాటకాలను ప్రదర్శిస్తూ సురభి కళాకారులు నాటకరంగాన్ని బతికిస్తున్నారు. బాలనాగమ్మ, పాతాళభైరవి, మాయాబజార్, చింతామణి, శ్రీకృష్ణ లీలలు ఇలా ఎన్నో నాటకాలను సురభి కళాకారులు ప్రదర్శిస్తూ నాటక రంగంలో తమదైన ముద్ర వేసుకున్నారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శనలు ఇచ్చేందుకు వచ్చిన 'సురభి' కళాకారులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

6 లో

రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో చరిత్ర సృష్టించాం

మంత్రాలయం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో చరిత్ర సృష్టించామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శ్రీగురు రాఘవేంద్రస్వామి 404వ పట్టాభిషేక మహోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జరిగిన పట్టాభిషేకం పూజల్లో పాల్గొని భక్తులనుద్దేంచి ఆయన మాట్లాడారు. తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలు తమపై ఉండాలని, సకాలంలో వర్షాలు బాగా కురవాలని, పంటలు సస్యశ్యామలం కావాలని స్వామివారిని మొక్కుకున్నామన్నారు. మంత్రాలయానికి రావడం రెండోసారి అని, గతంలో పాదయాత్రలో వచ్చినప్పుడు స్వామివారి దర్శనంపై చాలా మంది చాలా విషయాలు చెప్పారన్నారు. అప్పట్లో అభిప్రాయం కోసం తన తల్లి నారా భువనేశ్వరికి ఫోన్ చేశానన్నారు. 'నీ మనసులో ఏమి ఉందో.. అదే పాటించు..' అని ఆమె చెప్పారన్నారు. తన తల్లి చెప్పినమేరకు స్వామివారిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రంలో చరిత్ర సృష్టించామన్నారు. రాజకీయ రంగాల్లో విశేష సేవలు చేస్తున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవ-2025 అవార్డును మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను మఠం సంప్రదాయం మేరకు ఘనంగా సత్కరించారు. అనంతరం స్వర్ణ రథానికి పీఠాధిపతి పూజలు చేయగా.. మంత్రి లోకేశ్‌తో పాటు తిక్కారెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, బీటీ నాయుడు తదితరులు రథాన్ని ముందుకు లాగారు.


బంగారు రథాన్ని లాగుతున్న పీఠాధిపతి, మంత్రి నారా లోకేశ్, తిక్కారెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, బీటీ నాయుడు


గురు వైభవోత్సవాల్లో మంత్రి నారా లోకేశ్

- తెలుగు ప్రజలు అగ్రస్థానంలో ఉండాలి
- మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్
- గురు రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక వేడుకలకు హాజరు
- గురు వైభవోత్సవ అవార్డు అందజేసిన పీఠాధిపతి

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

గురు వైభవోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు జిల్లా అధికారులు, టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు విష్ణువర్దన్ రెడ్డి, కేఈ ప్రభాకర్, నాగేశ్వరరావు యాదవ్, ఆకేపోగు ప్రభాకర్, పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, పురుషోత్తం రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మహానందిలో పూర్ణాహుతి

మహానంది, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహానంది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయంలోని యాగశాల మండపంలో వేదపండితులు, అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభులింగమైన మహానందీశ్వరునికి జలాభిషేకం జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతోపాటు పెళ్లి పెద్దగా వచ్చిన నంద్యాల బ్రహ్మనందీశ్వరుని ఉత్సవమూర్తుల విగ్రహాలను మేళతాళాలతో రుద్రగుండం కోనేరు వద్దకు తీసుకొచ్చి పూజలు జరిపారు. ఉత్సవమూర్తుల విగ్రహాలను కోనేరులోని పంచ పాండవుల మంటపం వద్దకు తీసుకొచ్చి త్రిశూల స్నానం చేయించారు. మహా శివరాత్రి ఉత్సవాల ప్రారంభ సూచికంగా ధ్వజ స్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటాన్ని అవరోహణం చేశారు. అంతకుముందు యాగశాల మంటపంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ యర్రమల్ల మధుల చేత వివిధ ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి నిర్వహించారు.

నంద్యాలకు బయలుదేరిన బ్రహ్మనందీశ్వరుని ఉత్సవమూర్తులు

మహానంది శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగే మహానందీశ్వరుని కల్యాణం నిర్వహించేందుకు వచ్చిన నంద్యాల బ్రహ్మనందీశ్వరుని ఉత్సవమూర్తుల విగ్రహాలు శనివారం సాయంత్రం తిరిగి నంద్యాలకు వెళ్లాయి. ముందుగా ఆలయంలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఆశీనులు గావించారు. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మేళతాళాలతో ప్రత్యేక వాహనంపై నంద్యాలకు బయలుదేరి వెళ్లాయి. మార్గమధ్యలోని గ్రామాల్లో ఉత్సవమూర్తులకు ప్రజలు పూజలు నిర్వహించి కాయకర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు..


మహానందిలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ ఈవో, వేదపండితులు

మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారం రోజులపాటు కార్యక్రమాలు చేపట్టనున్నామని ఆమె తెలిపారు. శనివారం నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పురవీధులగుండా సాగి మున్సిపల్ కార్యాలయం చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలను గుర్తించి స్వశక్తితో వారు ఎదిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళ పారిశ్రామికవేత్తగా రాణిస్తే వేలాది మంది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. అడిషనల్ ఎస్పీ జావలి ఆల్ఫోన్స్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేకత, హోదా, గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు. ర్యాలీకి ముందు ఇండోర్ స్టేడియం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజు, భూగర్భ జలశాఖ డీడీ రఘురామ్, సీపీఓ వేణుగోపాల్, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణి, పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఏఎస్పీ

40 రోజుల్లో పులుల లెక్కింపు

రుద్రవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం నల్లమల రేంజ్‌లో కెమెరా ట్రాప్‌లతో పెద్దపులుల గణన శనివారం ప్రారంభించినట్లు రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. అధికారులతో సమీక్ష ఫారెస్టు కార్యాలయంలో నిర్వహించారు. 42133.28 హెక్టార్లలో విస్తరించిన 37 లొకేషన్లలో 40 రోజుల పాటు ఈ గణన కొనసాగుతుందన్నారు. 30 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 9 వరకు ఈ గణన కొనసాగుతుందన్నారు. ఎన్‌సీఆర్ పరిధిలో ఏ పెద్దపులి ఎక్కడ తిరుగుతుందో కెమెరా ట్రాప్‌లతో గుర్తించడానికి వీలవుతుందని తెలిపారు. ఈ గణన ఎన్ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


చెట్టుకు కట్టిన కెమెరా ట్రాప్

శ్రీగిరిపై ముగిసిన బ్రహ్మోత్సవాలు

- అశ్వ వాహనంపై ఆది దంపతుల విహారం
- చివరి రోజున పుష్పోత్సవం, శయనోత్సవం


అశ్వ వాహనంపై స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19న ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. పంచాహ్నిక దీక్షతో 11 రోజులు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు జరిపారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, శంఖు, డమరుక నాదాలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పుష్పోత్సవం

అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. కాగడాలు, పసుపు బంతి, పసుపుచేమంతి, తెల్లచేమంతి, నీలంచేమంతి, నందివర్ధనం, గరుడవర్ధనం, మందారం, ఎర్ర ఆస్టర్, నీలం ఆస్టర్, మల్లెలు మొదలైన 21 రకాల పుష్పాలతో విశేషంగా స్వామి, అమ్మవార్లను అర్చించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవ, శయనోత్సవం నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం హరికథ, భక్తిరంజని కార్యక్రమాలను నిర్వహించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.


నృత్యం చేస్తున్న కళాకారులు

నెలవంక దర్శనం

రంజాన్ మాసం ప్రారంభం

కర్నూలు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు మతపెద్దలు ప్రకటించారు. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనల కోసం ఇప్పటికే మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు, ప్రార్థనలు చేస్తారు. ఇది ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణ ఇస్తుందని మతపెద్దలు తెలియజేశారు. ఉపవాసాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని, అందరూ కలసిమెలసి సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. రంజాన్ మాసం సందర్భంగా ఉమ్మడి జిల్లాల్లోని మసీదులు ముస్తాబయ్యాయి. నిత్యం ఐదు పూటల నమాజులతోపాటు ప్రత్యేక పండుగ నమాజ్‌లకు మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీమ్ కేంద్రాలు కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ సమయంలో వివిధ రకాల ఫలాలకు ప్రాధాన్యత ఉండగా, ఖర్జూరం, పైనాపిల్, యాపిల్, కర్బూజ, కళింగర, ద్రాక్ష వంటి పండ్లకు బాగా గిరాకీ ఏర్పడింది.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- 53 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- 595 మంది విద్యార్థులు గైర్హాజర్


నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 53 పరీక్షా కేంద్రాల్లో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. సెకండ్ లాంగ్వేజి తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని చెప్పడంతో విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కొందరు విద్యార్థులు మాత్రం చివరి నిమిషంలో పరుగులు పెట్టి ఎట్టకేలకు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించారు. సమీపంలోని జిరాక్సు సెంటర్లను మూసేయించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి స్ట్రీమింగ్ ద్వారా పరీక్షలను పర్యవేక్షించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీ నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు శనివారం 16,174 మంది హాజరు కావాల్సి ఉండగా 595 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో సునీత తెలిపారు.


పరీక్షా కేంద్రంలో ప్రశ్నాపత్రం కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు


హాల్ టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు


పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల పహారా

తుంగభద్ర
సాహిత్యం



తెలుగుదనం ఉట్టిపడే.. పుల్లంపేట జరీ చీర

భాషలో తెలుగుదనం, తెలుగు జన జీవితం ఉట్టిపడేలా రచన చేయడంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అగ్రగణ్యులు. ఆధునిక కథకు గురజాడ అప్పారావు బీజం వేస్తే తర్వాతి కాలంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి జవసత్వాలు కల్పించారు. తెలుగు కథను ఆధునికత వైపు, వ్యవహారిక భాష వైపు నడిపించిన వైతాళికుడు. చక్కని గ్రామీణ నేపథ్యంతో కథలు రాయడంలో ఆయన నేర్పరి. శ్రీపాద రచించిన 45 కథలను 'పుల్లంపేట జరీ చీర' అనే పేరుతో కథా సంకలనం చేశారు. పుస్తకం ముఖ చిత్రంపైనే 'ప్రతి తెలుగువాడు తప్పక చదవాల్సిన కథలు' అని ఉంటుంది.

ఈ సంపుటిలోని కథలన్నీ చదివాక ఆ మాట తప్పక నిజమనిపిస్తుంది. ఇందులో ప్రతి కథలోనూ ఒక మంచి విషయాన్ని చెప్పారు. సంఘ సంస్కరణ, అవినీతి, అక్రమాలు, అంటరానితనం మీద చక్కటి సందేశాన్ని ఇచ్చారు. అగ్రవర్ణాల్లోని పేద బ్రాహ్మణుల జీవితాల నుంచి అట్టడుగు వర్గాల్లోని దళితుల జీవితాలను చక్కగా చిత్రించారు. ఒక కథకు మరో కథకు పోలికే లేదు. ఇంగ్లీష్ చదువు గొప్పదనాన్ని ఆ చదువు వల్ల వచ్చే సమాజంలో హోదాను గురించి శ్రీపాద గారు ఆనాడే తన కథలో చెప్పారు. మొదటి కథ సాగర సంగమంలో దళితుల మధ్య ఉన్న వ్యత్యాసాలను, పేదరికాన్ని గురించి చెప్పారు. ఒక పాత్ర చేత 'కూడు లేకపోయినా బతకవచ్చు... కానీ కులం లేకపోతే ఎలాగా' అని కులాభిమానం ఉన్న వ్యక్తి అంటే మరో పాత్ర చేత 'కులం కూడు పెట్టదు.. నీడనివ్వదు' అని చెప్పిస్తాడు. లీగల్ అడ్వైజ్ అనే కథలో చాడీలు చెప్పుడు మాటలను విని నమ్మకస్తులను కోల్పోయిన రాజావారి మనసును గురించి చెప్పారు. పుల్లంపేట జరీ చీర శీర్షిక కథలో భార్యాభర్తల అనుబంధాన్ని గొప్పగా చెబుతారు. పేద గుమస్తా ఖర్చులన్నీ తగ్గించేసి భార్యకు పుల్లంపేట జరీ చీరను కానుక ఇచ్చాడు. కన్యాశుల్కం వరశుల్కం అనే కథలో ఆడవాళ్లు కూడా చదువుకోవాలి, సొంత కాళ్ల మీద నిలబడాలనే సందేశాన్ని ఇస్తాడు రచయిత. 'అక్క చదువుకుంటే ఏమవుతుంది. బావని రానీ నించోబెట్టి అడుగుతాను' అని ఒక పాత్ర చేత చెప్పిస్తాడు. ఇదే కథలో ఆడపిల్లలను ఆట వస్తువులుగా అమ్మడం, ఉద్యోగం వచ్చిన కొడుక్కి ఎక్కువగా వరకట్నాన్ని గుంజడం లాంటి వ్యక్తుల మనస్తత్వాన్ని చక్కగా చిత్రించాడు. తెనుగు రక్తం చెప్పబడిపోతోంది అనే కథలో చిన్న ఉద్యోగాల నుంచి వచ్చిన వ్యక్తుల నుంచి లంచాలను జలగల్లా పీల్చే పెద్ద అధికారుల మనస్తత్వాన్ని చక్కగా చిత్రించారు. ఒక తరానికి మరో తరానికి ఉన్న అంతరాన్ని తెలియజేశారు. వృత్తి వేరు.. గుణం వేరు.. మంచి చెడ్డ నడవడికలో ఉంటుందే కానీ వృత్తిలో లేదని చెప్పిస్తాడు. దేశ దేశాల వాళ్లు మన దేశానికి వచ్చి వ్యాపారాలు చేసుకుని బాగుపడుతుంటే మన తెలుగు వాళ్లు మాత్రం గుమస్తాల్లాంటి చిన్న ఉద్యోగాల కోసం వెంపర్లాడటం గురించి చాలా చక్కగా చెప్పారు. ఇరువురు ఒకటే చోటికి పోదాము అనే కథలో జగ్గారెడ్డి, వెంకమ్మ మధ్య స్వచ్ఛమైన ప్రేమను కళ్లకు కట్టినట్లు చూపించారు.

స్థూలంగా చెప్పాలంటే శ్రీపాద కథలు తేట తెలుగులో సూటిగా ఎదుట కూచొని మాటలు చెప్పినట్లు ఉంటాయి. కాగితం మీద కథలు రాయడం అంటే అమ్మ లాలించి గోరు ముద్దలుగా తినిపించినట్లు ఉంటాయి. ఆయన కథలు మన సాంస్కృతిక స్థాయిని ఎత్తిపడతాయి. మన ఆలోచనల్ని బాగు చేస్తాయి. మన సంస్కారాన్ని ఉన్నతీకరిస్తాయి. మన సామాజిక అవగాహనను మానవీయంగా, ప్రగతిశీలంగా తీర్చిదిద్దుతాయి. శ్రీపాద కథలు చదవడం ఒక అద్భుతమైన కాల్పనిక అనుభవం. ఆయన కథలు రాసి మూడు తరాలు గడిచినా, ఇప్పటికీ తాజాగా, ఉదాత్తంగా మనల్ని తట్టి లేపుతాయి.



మానుక్రింది వెంకటేష్,
తెలుగు ఉపాధ్యాయుడు,
అక్షరశ్రీ మోడల్ హైస్కూల్, ఆదోని

సీమ రాజసం

యువకలం



రాయలసీమ రాజసం అతను
రాయలనాటి పాలెగాళ్లలో
ఒకరు
రణభూమిన తలదించని
వీరుడతను
తెల్లదొరలకు భయాన్ని
పరిచయం చేసిన ధీరోధాత్తుడు
అతడే మన వీర నరసింహుడు..!

రూపనగుడిన పుట్టిన బిడ్డడు
పౌరుషాన్ని ఉగ్గుపాలతో తాగిన
బాలుడు
మెలితిప్పిన మీసంలో ధీరత్వాన్ని
చూపిన ధైర్యవంతుడు
తాడిత పీడిత ప్రజల పక్షాన నిలిచిన
ధీరుడు
చీకటి బతుకుల్లో వెలుగు నింపిన
ప్రజ్వలిత సూర్యుడు
ఉరికొయ్యలను
ముద్దాడిన చారిత్రక
పురుషుడు
అతడే మన వీర
నరసింహుడు...!!

రవి అస్తమించని
సామ్రాజ్యాన్ని
గడగడలాడించాడు
అపర చాణిక్యుడిగా
యుద్ధతంత్రాన్ని
నడిపించాడు
గ్రామ సీమల్లో,
కొండకోనల్లో అంతటా
ఆయన నామస్మరణం
సైరా నరసింహారెడ్డి అంటూ...
ఆనాడు అయింది ప్రతినోటా ఒక జనపద
గీతం
అతడే మన వీర సరసింహుడు...!!
కుట్రలు ఎరుగని సహృదయవంతుడు
కుతంత్రాలు తెలియని మహనీయుడు
తన ప్రేమను పంచుకున్నవారే చివరికి
తనను బ్రిటీషు ముష్కరులకు
పట్టించినా...
చిద్విలాస మూర్తిలా చిరునవ్వులు
నవ్వుతూ
ఉరికొయ్యనెక్కిన యోదుడు...
అతడే మన ఉయ్యాలవాడ
నరసింహారెడ్డి..!!



- టి. ఉషారాణి, బీఎస్సీ,
కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, కర్నూలు.

నగరంలో నేడు

- నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమాలకు ముగ్గురు పీఠాధిపతులు హాజరవుతున్నట్లు దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త తెలిపారు.
- నగరంలో రోజా వీధిలో చారిత్రక రోజా దర్గాలో కొనసాగుతున్న ఉరుసు మహోత్సవాల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు మొక్కులు చెల్లింపు కార్యక్రమం ఉంటుందని దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదాబాషా ఖాద్రి తెలిపారు.
- నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 66వ పుణ్యతిథి కార్యక్రమం, 29వ గాడిచర్ల పురస్కార ప్రదానోత్సవం ఏర్పాటు చేసినట్లు గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర తెలిపారు.
- నగరంలోని సీక్యాంపులోగల టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు దివంగత సంగీత గురువు దాసరి రంగముని జ్ఞాపకార్థం 'స్వర దాసరి వారి స్వర తరంగాలు' పేరుతో శాస్త్రీయ సంగీత, నృత్య ప్రదర్శనలు, సంస్మరణ సభ ఏర్పాటు చేసినట్లు రంగమాధురి కళానిలయం నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**



అహో.. సురభి

- కళా సౌరభం.. సురభి నాటకం
- కట్టిపడేసే నటనా రాజసం
- రెప్పపాటులో మారిపోయే సెట్టింగులు
- హాస్యం.. ఆహార్యం.. అద్భుత నటన వారి సొంతం
- 140 ఏళ్లు పూర్తి చేసుకున్న నాటక సమాజం
- నేడు ఆదరణ కరువై తెరచాటుకు...

కర్నూలు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'మాయాబజార్' నాటకంలో ఘటోత్కచుడు పాత్రధారి 'వివాహ భోజనంబు..వింతైన వంటకంబు..వియ్యాల వారి విందు..అహ్హహ్హ నాకే ముందు' అంటూ లడ్డుల బేషన్‌పై చేయి పెట్టి తిప్పగా ఒక్కో లడ్డూ గాల్లో లేస్తూ ఘటోత్కచుని నోట్లోకి వెళుతుంది. 'శ్రీకృష్ణ లీలలు'లో వసుదేవుడు బాలకృష్ణుడిని తీసుకొని వెళ్తుండగా యమునా నది రెండుగా చీలి దారి ఇస్తుంది. మెరుపులు, ఉరుములు కళ్లముందే ప్రేక్షకులకు కానవస్తాయి. ఇదంతా సినిమాల్లో అనుకుంటే పొరపాటే. సినీమా రంగంకన్నా ముందే ఇలాంటి ఎన్నో సాంకేతిక పరిజ్ఞానం కలబోసి వీక్షకులను మెప్పించిన ఘనత సురభి కళా సమాజానిది. ఒకప్పుడు సినిమాలాగే టికెట్ పెట్టి మాత్రమే చూడగలిగే ఏకైక నాటకాలు సురభి నాటకాలే. ప్రేక్షకులను నవరసాల్లో తేలియాడించి, ఒక చక్కని అనుభూతిని కలిగింపజేసే సురభి నాటక ప్రస్థానానికి 140 ఏళ్లు. ఎనిమిది తరాల వారసత్వాన్ని కాపాడుకుంటూ ఈ కళాసమాజాలు నేటికీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తమ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నాయి. తెరవెనుక ఎన్ని కష్టనష్టాలున్నా, తమ జీవనాలు దయనీయంగా సాగుతున్నా, ముఖానికి రంగేసుకున్నాక, సర్వం మరిచిపోయి, తెరముందు వినోదాల విందును అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలు వృద్ధాప్యంలో ఊతకర్రతో తారాడే వయోవృద్ధుల వరకు ఆయా వయసులకు తగ్గట్టు పాత్రల్లో వారు జీవిస్తారు. అందుకే సురభి కళ వందేళ్లకు పైగా ప్రవర్థిల్లుతోంది. తాజాగా రెండు రోజులుగా టీజీవీ కళాక్షేత్రంలో సురభి నాటకోత్సవాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. ఈ నేపథ్యంలో సురభి కళాకారులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

రాయలసీమలోనే సురభి సమాజం పుట్టుక

ప్రపంచ ఖ్యాతి పొందిన సురభి నాటక సమాజాల పుట్టుక రాయలసీమలోనే జరిగింది. 1885లో కడపజిల్లా చక్రాయపేట మండలం, సురభి రెడ్డివారిపల్లెలో శ్రీ శారదా వినోదిని నాటక సభను మొట్టమొదట ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఈ సంస్థ విస్తరించి 50 వేర్వేరు బృందాలుగా వృద్ధి చెందింది. ప్రతి బృందంలో 30 మందికి పైగా సభ్యులతో స్వయంగా నాటకాలు వేసేవారు. అలా ఆ కుటుంబంలో సురభి బాబ్జీ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఆయా సమాజాలన్నీ అంతరించిపోగా, నాలుగైదు సమాజాలు మాత్రమే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తమ ప్రదర్శనలు ఇస్తున్నాయి. అందులో ఒకటిగా శ్రీ సాయి సంతోషి సురభి నాట్యమండలి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలతో ముందుంటోంది.



ప్రత్యేకంగా ప్రోత్సహించాలి

భారీ సెట్టింగులు, 30 నుంచి 40 మంది కళాకారులతో సురభి నాటక ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సురభి కళను ప్రత్యేకంగా గుర్తించాలి. ఇటు సినిమా, అటు టీవీ ప్రభావంతో శత వసంతాలు దాటిన సురభి సమాజాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దినదిన గండంగానూ మా పరిస్థితి కొనసాగుతోంది. ఈ వృత్తిని వీడిపోలేక, ఈ కళను తెరచాటుకు తోసివేయలేక ఎన్నో తిప్పలు పడి నాటకాలు వేస్తున్నాం. వివిధ ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖలు మాకు ప్రోత్సాహం ఇవ్వాలని ఎదురు చూస్తున్నాం.

- సురభి సంతోష్, నాటక ప్రదర్శనల కోఆర్డినేటర్

ఒక్కో నాటకానికి రెండు లారీల సామగ్రి అవసరం

సురభి నాటకం అంటే ప్రతి సీన్‌కు ప్రత్యేక సెట్టింగ్ ఉండాల్సిందే. అందుకు కావాల్సిన సామగ్రిని వారే సమకూర్చుకుంటారు. అలా ఒక నాటకం ప్రదర్శనకు సుమారు 2 లారీలతో ఈ కళాకారులు 30 మందికి పైగా పట్టే మరో వాహనంలో ప్రదర్శనలకు బయల్దేరుతారు. అలాగే ఆయా పాత్రలకు కావాల్సిన దుస్తులు, ఆహార్యం (మేకప్) ఎవరికి వారే సమకూర్చుకుంటారు. ఖరీదైన వస్త్రాలు, మేకప్‌లకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒకప్పుడు సంచార జీవనం సాగించే సురభి నాటక సమాజాలు పిల్లల చదువుల రీత్యా ప్రస్తుతం ఒక ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. అలాగే వివిధ వృత్తి, ఉద్యోగాలు చేసుకుంటూనే ఈ నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

వారసత్వంగా వస్తోంది

సురభి నాటకాలను మా వారసత్వ సంపద. ప్రస్తుతం 8వ తరం నడుస్తోంది. మా పూర్వీకులు కడప జిల్లా నుంచీ తమ కళాప్రదర్శనలు ప్రారంభించారు. సినిమా, టీవీలు వచ్చాక మాకు కొంత ఆదరణ తగ్గింది. ప్రభుత్వం సహకారం అందిస్తే మళ్లీ పూర్వవైభవం వస్తుంది. ఇతర వర్గాలకు ఇస్తున్నట్లే సురభి నాటక కళాకారులను గుర్తించి వారికి ఇంటి స్థలాలు, పింఛన్లు కల్పిస్తే బాగుంటుంది.

- సురభి కొండలరావు, అధ్యక్షుడు, శ్రీసాయి సంతోషి సురభి నాట్య మండలి



మేకప్ వేసుకుంటున్న కళాకారుడు



సురభి నాటకంలోని ఓ దృశ్యం

ఇక్కడే పుట్టాం.. ఇక్కడే జీవిస్తున్నాం

మా నాన్నగారు సురభిలోనే నటించారు. ఆయన వారసత్వంగా మా కుటుంబం అంతా సురభిలోనే పుట్టి, సురభిలోనే పెరిగింది. వివాహం, పిల్లలు, వారి జీవితం కూడా ఇక్కడే కొనసాగుతోంది. ఇది ఒక వారసత్వ పరంపరగా భావిస్తూ, ఈ కళారంగాన్ని బతికించుకోవాలనే ప్రయత్నంతో సాగుతున్నాం. టీవీల్లో అవకాశాలు వచ్చినా అక్కడ కొన్ని సాంకేతిక సమస్యలు, నిబంధనలతో వెళ్లలేకపోతున్నాం. **- ఆర్.రామలక్ష్మి, సీనియర్ నటి**

కళలను ఆదరించాలి



నా బాల్యంలో భక్త ప్రహ్లాద నాటకం ద్వారా రంగప్రవేశం చేశాను. మా నాటకాలకు మేమే స్క్రిప్టులు, పద్యాలు, డైలాగులు రాసుకుంటాం. ఒకే కుటుంబం కావడంతో వ్యక్తిగత భేదాభిప్రాయాలు అంటూ ఏమీ ఉండవు. నటనపై ధ్యాస తప్ప మరొకటి తెలియదు. మా పిల్లలను బాగా చదివిస్తున్నాం. భవిష్యత్తులో ఈ కళను కాపాడుకుంటూనే పిల్లలను ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా చేయాలనేది మా ఆశ. మనకు తొలుత తోలుబొమ్మలాటలు, తర్వాత నాటకాలు, రేడియో, సినిమాలు, టీవీ, ఇంటర్నెట్ ఇలా అనేక మాధ్యమాలు వచ్చేశాయి. కానీ మహిళలు కేవలం టీవీ సీరియళ్లకే పరిమితం అవుతున్నారు. పౌరాణిక, చారిత్రక నాటకాల వల్ల అనేక అంశాలు తెలుస్తాయి. మహిళలు సురభి నాటకాలను ఆదరించాలి. **- హారిక, యువ కళాకారిణి**

సురభి నాటకాలకు ప్రత్యేక స్థానం



140 ఏళ్ల చరిత్రగల సురభి నాటక సమాజాలకు చాలా గొప్ప పేరే ఉంది. భారత దేశంలో సురభి లాంటి నాటక సమాజాలు ఎక్కడా కానరావు. సురభి కళ మన రాష్ట్రానిదై, ప్రత్యేకించి రాయలసీమకు చెందినదై ఉండడం విశేషం. సురభి సమాజాలకు అంతంత మాత్రమే చేయూత లభిస్తున్నా, ఉన్న ఆసరాతోనే బతుకుతూ అనేక కష్టనష్టాలకు ఓర్చుతూ ముఖంపై నవ్వు చెరిగిపోనీకుండా తమ వారసత్వ కళను బతికించుకోవాలనే వారి తపన మహోన్నతంగా నిలుస్తోంది. అందుకే రెండు రోజుల పాటు ఉచితంగా ఈ నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లోనూ సురభి కళాకారులకు తగిన ప్రోత్సాహకాలు కళాక్షేత్రం పక్షాన అందజేస్తాం.

- పత్తి ఓబులయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కర్నూలు

చెంచుగూడేల్లో అక్షర దీపం

- భక్తకన్నప్ప గురుకులానికి 50 ఏళ్లు
- ఐదు ఎకరాల స్థలంతోపాటు వసతి భవనం నిర్మించిన జీ పుల్లారెడ్డి
- చెంచుల్లో అక్షరాస్యత కోసం కృషి చేస్తున్న సేవా భారతి
- నేడు సిల్వర్ జూబ్లీ వేడుక





గురుకులంలో చదువుకుంటున్న గిరిజన చిన్నారులు

ఆత్మకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చెంచులకు చదువు చెప్పడానికి ఏర్పాటు చేసిన భక్త కన్నప్ప గురుకులం 25 ఏళ్ల కింద ఏర్పాటైంది. ఇప్పుడు ఈ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటోంది. శ్రీశైలంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. ఉద్యోగ విరమణ పొందిన దివంగత మల్లికార్జునశర్మ 1999 నవంబర్ 18న శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రంలో సేవాభారతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో భక్త కన్నప్ప చెంచు గురుకుల పాఠశాల (సోమేపల్లి సోమయ్య వనవాసి వికాస సేవా కేంద్రం) స్థాపించారు. 15 మందితో ఈ పాఠశాల ప్రారంభమైంది. కొత్తపల్లి, ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, రుద్రవరం, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో వున్న చెంచుగూడేలకు అందుబాటులో ఉండటానికి కొత్తపల్లి మండలంలోని గోకవరం గ్రామంలో ఏర్పాటు చేశారు. సేవాభారతి స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రముఖ మిఠాయి వ్యాపారి గుణంపల్లి పుల్లారెడ్డి దీనికి పూర్తిగా సహకరించారు. దీని కోసం ఆయన ఐదు ఎకరాల స్థలం ఇచ్చారు. సొంత డబ్బుతో భవనాలు నిర్మించి 2002 డిసెంబర్ 14న ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంలో తర్ఫీదు

భక్తకన్నప్ప గురుకులంలో చెంచు చిన్నారులకు 1నుంచి4వ తరగతి వరకు చదువు చెబుతారు. ఆ తర్వాత గోకవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను సేవాభారతి స్వచ్ఛంద సంస్థ సమకూరుస్తుంది. విద్యార్థులకు కంప్యూటర్, చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తారు. ప్రకృతి వ్యవసాయంలో తర్ఫీదు ఇస్తారు. నంద్యాల జిల్లా పరిధిలోని వివిధ చెంచుగూడేలకు చెందిన 43 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. భక్తకన్నప్ప గురుకుల పాఠశాల కేంద్రంగా 13ఏళ్ల పాటు గూడేల్లో సంచార వైద్య శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

చెంచులను అక్షరాస్యులను చేయడమే లక్ష్యం



చెంచులకు అక్షరజ్ఞానాన్ని అందించడం కోసం భక్తకన్నప్ప గురుకుల పాఠశాలను స్థాపించారు. 25 ఏళ్లుగా నిర్విరామంగా చెంచు చిన్నారులకు ఈ పాఠశాల ద్వారా చేయూతనిస్తున్నాం. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- మాయలూరి రఘురాములు, భక్తకన్నప్ప గురుకులం సెక్రటరీ, గోకవరం

చెంచులకు మెరుగైన వైద్య సేవలు



25ఏళ్ల క్రితం రవాణా సదుపాయం అంతంత మాత్రంగానే ఉండేది. భక్తకన్నప్ప గురుకులం తరఫున మేమే సంచార వైద్యశిబిరాల ద్వారా అన్ని గూడేల్లో వైద్యసేవలు అందించాము. క్షయవ్యాధిపై అవగాహన కల్పించి ఉచితంగా పౌష్టికాహారం, మందులు పంపిణీ చేశాం.

-వాసుదేవరెడ్డి, సంచార వైద్యశాల కోఆర్డినేటర్, గోకవరం

వైభవంగా రోజా దర్గా ఉరుసు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న ఖవ్వాలి



రోజా దర్గాకు చాదర్ తీసుకువస్తున్న నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుంకేసుల రోడ్డులోని రోజా దర్గాలో వెలసిన హజ్రత్ సయ్యద్ షా ఇస్హాక్ సనావుల్లా ఖాద్రి 535వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన హిందూ, ముస్లిం భక్తులు దర్గాకు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరికాయలు, పూలు, చాదర్‌లు సమర్పించుకున్నారు. శనివారం రాత్రి జరిగిన పూజా కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఆయనకు దర్గా కమిటీ ప్రతినిధులు దర్గా లాంఛనాలతో ఘనస్వాగతం పలికారు. దర్గాలో గౌరు వెంకటరెడ్డి బాబావారికి పూల దండలు, చాదర్‌లు సమర్పించారు. అనంతరం దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదాబాషా ఖాద్రితో కలిసి గౌరు వెంకటరెడ్డి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా రోజా దర్గా నిలుస్తోందని, ఇక్కడికి విచ్చేస్తున్న హిందూ, ముస్లిం భక్తుల ఆదరణనే అందుకు ఉదాహరణంగా నిలుస్తోందని చెప్పారు. అనంతరం హైదరాబాదుకు చెందిన కళాకారులతో ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జియారతె ఫాతెహా (మొక్కులు చెల్లింపు) ఉంటుందని దర్గా నిర్వాహకులు తెలిపారు.



రోజా దర్గా వద్ద ఉరుసు మహోత్సవాల సందర్భంగా భక్తుల సందడి

గురు రాఘవేంద్రా నమో నమః

- వైభవంగా ప్రారంభమైన గురుభక్తి ఉత్సవాలు
- అట్టహాసంగా 404వ పట్టాభిషేక మహోత్సవం
- రాఘవేంద్ర స్వామి బంగారు పాదాలకు అభిషేకం
- దేశ నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు


రథాన్ని లాగుతున్న భక్తులు

మంత్రాలయం మార్చి 1, (ఆంధ్రజ్యోతి): గుండెల నిండా భక్తి నింపుకుని గురు రాఘవేంద్ర నమోనమహః అంటూ దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి తమ గురువులైన గురు రాఘవేంద్రస్వామిని స్మరించుకున్నారు. రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా శనివారం మఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు మొదటి రోజు రాఘవేంద్ర స్వాముల 404వ పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రారంభించారు.

రాఘవేంద్రస్వామి నడిచిన బంగారు పాదుకలను బంగారు మండపంలో బంగారు సింహాసనంపై అధిష్ఠించి పుష్పాలు, గంగాజలం, బంగారు నాణేలు, ముత్యాలు, పాలతో అభిషేకం చేశారు. బంగారు పాదుకలను పీఠాధిపతి తలపై పెట్టుకుని తన గురుభక్తిని చాటుకున్నారు. అనంతరం బంగారు పాదుకలను బంగారు రథంపై అధిష్ఠించి పీఠాధిపతులు మహామంగళహారతితో ముందుకు సాగారు. దాసవాన సాహిత్య భజన మండళ్ల ఆధ్యాత్మిక భక్తి గీతాలు, కోలాట నృత్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, చండా వాయిద్యాల మధ్య బంగారు రథం మఠం ప్రాకారంలో ఊరేగుతుండగా భక్తులతో మార్మోగింది. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించి బంగారు, వెండి, పట్టువస్త్రాలతో శోభాయామానంగా అలంకరించారు. రాఘవేంద్రస్వామి మహిమలు, జీవిత ఘట్టాలపై పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో దివ్య సందేశాన్ని అందించారు. మూలరాములకు అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు.

వివిధ రాష్ట్రాల భక్తులు పాల్గొనడంతో మంత్రాలయం భక్తులతో కిక్కిరిసింది. కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, ఏఏవో మాధవశెట్టి, మాజీ మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, మేనేజర్ వెంకటేష్ జోషి, ఐపీ నరసిం హమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ప్రకాష్‌ఆచార్, శ్రీహరినాథాచార్, అనంతపురాణిక్, రవి కులకర్ణి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంత స్వామి, సుధీంద్రాచార్, వ్యాసరాజాచార్, రాజాఎస్ అప్రమే యాచార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు,


పాదుకలకు కనకాభిషేకం చేస్తున్న పీఠాధిపతి

అలరించిన కూచిపూడి నృత్యం

హైదరాబాదు వారి కళాకారులచే కందుల కూచిపూడి నృత్యాలయం బృందం వారిచే నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో అలరించింది. చెన్నైకు చెందిన విద్వాన్ రిత్విక్‌రావు వోకల్ శాస్త్రీయ సంగీతం భక్తులను ఆకట్టుకుంది. వీటిని మెచ్చిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఎం ఆనందరావు, మాజీ మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, జేపీ స్వామి, అనంతపురాణిక్ పాల్గొన్నారు.

20 నుంచి 25 వరకు సెపక్‌తక్రా వరల్డ్ కప్ పోటీలు

- 40 దేశాలు పాల్గొనే అవకాశం



కర్నూలు స్పోర్ట్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా ప్రపంచ స్థాయి పోటీలను ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహిస్తున్నట్లు భారత్ సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జి. శ్రీనివాసులు తెలిపారు. దీనికి సంబంధించిన పోటీల లోగోను బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ లాంచనంగా ప్రారంభించారు. బీహార్ ప్రభుత్వం ఆర్థిక సహకారంతో సుమారు 15 కోట్ల వ్యయంతో ఈ పోటీలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నారని, ఈ ప్రపంచ స్థాయి పోటీలను అఖిల భారత్ సెపక్‌తక్రా సంఘం, బీహార్ సెపక్‌తక్రా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రపంచ స్థాయి సెపక్‌తక్రా వరల్డ్ కప్ పోటీలకు ప్రపంచంలోనే సుమారు 40 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.

విద్యార్థినికి కలెక్టర్ పరామర్శ


విద్యార్థిని పరామర్శిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు హాస్పిటల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సి.బెళగల్ మండలం పోలకల్ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని శ్రీలేఖను శనివారం ఉదయం 6 గంటలకు కలెక్టర్ పి.రంజిత్ బాషా పరామర్శించారు. శుక్రవారం విద్యార్థిని మీద చెట్టు విరిగి పడటంతో గాయాలై కర్నూలు జీజీహెచ్‌లో క్యాజువాల్టీలో చికిత్స పొందుతోంది. విద్యార్థినితో పాటు మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థిని కుడి కాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. వెంటిలేటర్ ద్వారా క్యాజువాల్టీలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఆందోళన చెందవద్దని కలెక్టర్ విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడారు. గాయపడిన విద్యార్థినికి క్యాజువాలిటీలో రాత్రంతా సేవలు అందించిన మెడిసిన్ ఆర్థో విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.మీనుగా శ్రీనివాసులు, డా.అమర్‌నాథ్ రెడ్డి, పీజీలు, నర్సింగ్ సిబ్బంది, అనస్థీషియా టెక్నిషియన్ దినేష్‌ను సూపరింటెండెంట్ అభినందించారు. రోగిని ఆర్ఐసీయూకు షిఫ్ట్ చేసి సేవలు అందిస్తున్నామన్నారు.

న్యాయాధికారులకు శిక్షణా శిబిరం


మాట్లాడుతున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల న్యాయాధికారులకు శనివారం ఒక్కరోజు ప్రత్యేక శిక్షణా శిబిరం జరిగింది. కర్నూలు ట్రిపుల్ ఐటీలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది న్యాయాధికారులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి సత్యవాణి, కర్నూలు అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

నందవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరకట్న వేధింపులు తట్టుకోలేక ఆశీర్వాదమ్మ (26) అనే మహిళ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నందవరానికి చెందిన ఆశీర్వదమ్మను అదే గ్రామానికి చెందిన మద్దన్నకు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లి అయినప్పటి నుంచి భర్త, ఆయన తల్లిదండ్రులు, బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. ఆ బాధ తాళలేక తాను ఇంట్లోనే ఉరి వేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ టికెట్లపై కేసు నమోదు

శ్రీశైలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల స్పర్శ దర్శనం టికెట్ల గోల్‌మాల్ జరగడంతో దేవస్థానం సీఎస్ఓ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫిబ్రవరి 14న కొందరు దళారులు భక్తులకు మాయమాటలు చెప్పి నకిలీ టికెట్లు అంటగట్టారు. ఉచిత క్యూలైన్లలో గంటల కొద్ది వేచి ఉన్న భక్తుల వద్దకు వెళ్లి స్వామి వారి స్పర్శ దర్శనం టికెట్లు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా భక్తులకు విక్రయించే రూ.500 టికెట్ ను నకిలీ టికెట్‌గా తయారు చేసి రూ.900 కు విక్రయించ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఎప్పుడో జారీ చేసిన టికెట్లపై తేదీలను మార్చి నకిలీ రబ్బరు స్టాంపులతో విక్రయించారు.

సాధారణంగా స్పర్శ దర్శనం టికెట్టు ఆన్‌లైన్ ద్వారా పొందాలంటే ఆధార్ తప్పనిసరి. కొందరు కేటుగాళ్లు ఈ నకిలీ టికెట్లకు ఆధార్ జత చేసి భక్తులకు విక్రయించారు. వీటిపై నిఘా పెట్టిన కొందరు అధికారులు ఈ విషయాన్ని ఈవో ఎం. శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విశషయమై స్థానిక పోలీసు సేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

27 నుంచి ఉగాది మహోత్సవాలు

- మార్చి 20లోపు ఏర్పాట్లు పూర్తి కావాలి : ఈవో


మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు, పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు ఉగాది మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణపై శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు కార్యాలయ భవనంలోని సమావేశమందిరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, అన్ని విభాగాధిపతులు, పర్యవేక్షకులు, ఉభయ ఆలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించి నందుకు సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగాది మహోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికా రులను ఆదేశించారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాలలో సదుపాయాలు కల్పించాలని అన్నారు. క్యూలైన్లలో ఏర్పాట్లు, క్షేత్ర పరిధిలో తాత్కాలిక వసతి, మంచినీరు, విద్యుద్దీకరణ, వైద్యశిబిరాల ఏర్పాటు, సూచిక బోర్డుల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశించారు.

సరిహద్దుల్లో తాగు నీటి వివాదం

- కాలువ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న బోర్డు అధికారులు

హాలహర్వి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో తాగునీటి పైపులైన్ నిర్మాణం విషయంలో కర్ణాటక గ్రామస్థులు, టీబీబీ డీఈ హసేన్ బాషా మధ్య వివాదం నెలకొంది. కర్ణాటక రాష్ట్రం యర్రగుడి వద్ద తాగునీటి కోసం జలాశయాన్ని నిర్మించారు. ఇప్పటివరకు నీటితో నింపుకోలేదు. మోటార్ల సహకారంతో నింపుకోవాల్సిన కర్ణాటక ప్రజాప్రతినిధులు అత్యుత్సాహం ప్రదర్శించారు.

ఎర్రగుడి సర్పంచ్ సురేష్ ఎమ్మెల్యే నాగేంద్ర అనుచరుడంటూ ఏకంగా కాల్వనే తవ్వేందుకు శ్రీకారం చుట్టారు. ఎల్లెల్సీ సిబ్బంది అడ్డుకున్న వినలేదు. ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఎల్లెల్సీ బోర్డు డీఈ హసేన్ బాషా సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనుమతి లేకుండా దౌర్జన్యంగా పనులు చేస్తున్నారని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాగునీటికి తాము వ్యతిరేకం కాదని, అయితే కాలువనే తవ్వుతామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. కర్నూలు జిల్లాకు సైతం తాగునీరు ఇస్తున్నామని, ఇలా దౌర్జన్యంగా కాలవను తవ్వడానికి మాత్రం అనుమతి ఇవ్వబోమని తేల్చి చెప్పారు. చివరకు వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎస్‌వో దుర్గాప్రసాద్ ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులూ లోడ్ క్రమబద్ధీకరించుకోండి

- కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి

కల్లూరు మార్చి1 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. ఏపీఈఆర్‌సీ వినియోగదారులకు స్వచ్ఛంద విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఈ పథకాన్ని ప్రారంభించడానికి మార్గదర్శకాలు జారీ చేసి ఉన్నారని చెప్పారు. గృహ విద్యుత్ వినియోగదారులు తమ అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిపార్ట్‌మెంట్ రుసుములో 50శాతం రాయితీతో చెల్లించడానికి ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.ఏపీఎస్‌పీడీసీఎల్.ఇన్ లేదా సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

అదేవిధంగా డిపార్ట్‌మెంట్‌కు చెల్లించ వలసిన సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎటువంటి మార్పు లేదని సూచించారు. ఈ అవకాశం 1 మార్చి 2025 నుంచి 30 జూన్ 25 వరకు ఉంటుదన్నారు. ఈ అవకాశాన్ని గృహ విద్యుత్ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని ఒక కిలోవాట్‌కు వెయ్యి రూపాయలు లబ్ధి పొందాలని ఎస్ఈ తెలిపారు.

పశుగణనలో తప్పుడు వివరాలు

- ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న 21వ జాతీయ పశుగణన కార్యక్రమంలో అధికారులు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని గోకులం సమావేశం మందిరంలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపదను వాస్తవంగా ఉన్నదానికంటే ఎక్కువ చేసి తప్పుడు వివరాలు నివేదికలో పొందుపర్చుతున్నారని అన్నారు. భారత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పశుసంవర్థక శాఖకు సంబంధించి పశువుల ట్యాగింగ్ కానీ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు కానీ చేపట్టవద్దని అలా చేయడం వల్ల పశుగణన కచ్చితత్వంపై ప్రభావం చూపిస్తుందని స్పష్టంగా ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. పశువుల సంఖ్యతో సంబంధం లేకుండా వంద శాతం వ్యాక్సినేషన్ చేసి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న సిబ్బందిపై అధికారులు ఒత్తిడి పెంచడం దారుణమన్నారు. తప్పుడు వివరాల నివేదికలో లేని పశువులను కూడా చూపడం వల్ల వాటికి ఏవిధంగా వ్యాక్సినేషన్ చేసినట్లు నమోదు చేయాలో సిబ్బంది అర్థం కాకా అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులపై పని ఒత్తిడి భారాన్ని తగ్గించాలని ఆదేశించారు. సమావేశంలో జేవీవో, వీఎల్‌వో అసోసియేషన్ కార్యదర్శి రంగన్న, వైస్ ప్రెసిడెంటు జనార్దన్ రెడ్డి, ఇతర నాయకులు రాముడు, చంద్ర యాదవ్, వెంకటురమణ, బజారి, సెక్రటరీ సుబ్బరాయుడు, ఇతర సభ్యులు సుధాకర్, రమేష్, స్రవంతి సుభాన్ రామకృష్ణ, నరసన్న పాల్గొన్నారు.

కేఎంసీ సర్జరీ పీజీ విద్యార్థుల ప్రతిభ


సర్జరీ పీజీలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 2025లో జరిగిన పీజీ వైద్య విద్యార్థుల పరీక్షల ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారు. డా.ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విజయవాడ విడుదల చేసిన ఫలితాల్లో డా.విష్ణు శ్రీకర్ రెడ్డి 613 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచారు. డా.ఏ.తేజేశ్వర రెడ్డి 610 మార్కులతో రెండో ర్యాంకు, డా.పి.వెంకట శివనాగజ్యోతి 602 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఒకేసారి స్టేట్ మూడు ర్యాంకులు సాధించడం రికార్డుగా నిలిచిందని కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డా.పి.హరిచరణ్ వైద్యులను అభినందించారు. మొదటి మూడు స్టేట్ ర్యాంకులు సాధించిన పీజీ విద్యార్థులు మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ డిగ్రీ చేసి పేద ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్లు డా.రామకృష్ణ నాయక్, డా.కోటి రెడ్డి, డా.చక్రవర్తి, డా.మాధవీ శ్యామల, డా.జయరాం వైద్యులు పాల్గొన్నారు.

రుణం తీర్చుకోవడం గొప్ప అవకాశం

- క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చదివిన కళాశాల రుణం తీర్చుకోవడం గొప్ప అవకాశమని ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో 1971 నుంచి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామనడం అభినందనీయమన్నారు. రూసా నిధులతో నూతనంగా నిర్మించిన భవనాలకు, కళాశాల వ్యవస్థాపక సభ్యుడైన ముఖ్యదాత పేలాల కొండయ్య పేరు, మహిళా హాస్టల్‌కు వారి సతీమణి పేరు పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కే. వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వై. జయరాజు, కమిటీ కన్వీనరు మల్లికార్జున, పేలాల ప్రేమ్ కుమార్, శివశంకర్ రెడ్డి, మన్సూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో సంగీత దర్శకుడు కీరవాణి

మంత్రాలయం, మార్చి1 (ఆంధ్రజ్యోతి) రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, తనయులు శ్రీసింహ, కాలభైరవ కుటుంబ సమేతంగా శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వీరివెంట సీపీ స్వామి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

పగిడ్యాల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి నెల 1వ తేది లబ్ధిదారులకు పింఛన్ అందజేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని నెహ్రూనగర్, పగిడ్యాల, ఆంజనేయ నగర్ గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ మోహన్, టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామస్వామి, హేమసుందరరాజు, ఫరూక్‌బాషా, నరసింహారెడ్డి, నరసింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల్లోపు సమస్యలు పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను 15 రోజుల్లోపు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, టీడీపీ నాయకులు దామోదర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వాసురెడ్డి, విజయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఆత్మకూరు/మిడుతూరు/పాములపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు, మిడుతూరు, పాములపాడులో శనివారం ఇంటర్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: రిజిస్ట్రార్

ఆత్మకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ జానకీ దేవి హెచ్చరించారు. శనివారం ఆమె ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు గురించి సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత నూతనంగా నిర్మించిన విశ్రాంత ప్రాంగణాన్ని ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అసోసియేషన్ వారు ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యాలయ ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది శివప్రసాద్, ఆదిలక్ష్మి ఉన్నారు.

నేత్రాలు దానం



నేత్రాలను అందజేస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో వెంకటేశ్వర్లు (ఫైల్)

నంద్యాల హాస్పిటల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని స్టేట్ బ్యాంక్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందారు. అయితే ఇద్దరి జీవితాలకు వెలుగులు నింపారు. వెంకటేశ్వర్లు కళ్లను దానం చేయడానికి భార్య పద్మావతి, కుమార్తెలు లక్ష్మీకుమారి, సుమలత, మంజుశ్రీ, మహేశ్వరి, కర్ల ముందుకొచ్చారు. నంద్యాలలోని ఫ్రెండ్స్ ఫర్ సేవా సొసైటీ ప్రతినిధులు బాపూజీ నాయక్, కిశోర్‌ను సంప్రదించారు. వారు వెంటనే కర్నూలులోని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థకు సమాచారం ఇవ్వడంతో మెడికల్ టెక్నీషియన్లు నంద్యాలలోని రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. డైరెక్టర్ ప్రదీప్, చైర్మన్ విష్ణుగాయత్రి, ఫౌండర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

శాంతిరాం కళాశాలలో వంటల పోటీలు

పాణ్యం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న సిగ్మా 14 వజాతీయ సాంకేతిక సదస్సులో రెండో రోజు శనివారం విద్యార్థులకు మంట లేకుండా వంట పోటీలు నిర్వహించారు. విజేతలకు మొదటి మూడు బహుమతులు వరుసగా రూ. 2వేలు, రూ. 1500, రూ.1,000 అందజేశారు. వంటల పోటీలలో విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలు ఎంతో ఆకట్టుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. సిబ్బందిని కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు అభినందించారు. ఎండీ శివరాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, కన్వీనర్లు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ శేషయ్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ప్రతిభకు, ఆత్మవిశ్వాసానికి సాంకేతిక సదస్సులు భరోసా కల్పిస్తాయని ఆర్జీఎం కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. ఆర్జీఎంలో శనివారం కమ్యూటర్ సైన్స్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు (డిఫెండ్ - ఎక్స్) నిర్వహించారు. విద్యార్థులకు కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం లు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీ కవిఅరసన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'చికెన్ దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలి'



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

నంద్యాల క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులను కించపరిచేలా నంద్యాలలో పోస్టర్లు పెట్టి చికెన్ మేళా నిర్వహించారని, చికెన్ సెంటర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. శనివారం సాయంత్రం టూ టౌన్ సీఐ ఇస్మాయిల్‌కు ఫిర్యాదు చేశారు. నాయకులు మురళీకృష్ణ, సురేంద్రచారి మాట్లాడుతూ పోస్టర్‌లో ఓ భాగంలో చికెన్ రోస్ట్, పకోడీకి సంబంధించిన ఫొటోలు పొందుపరచి కింది భాగంలో బ్రాహ్మణ వేషధారణలో ఉన్న సినీ నటుడు బ్రహ్మనందం చిత్రాన్ని ఏర్పాటు చేసి కామెంట్స్ రూపంలో ప్రచురించారని ఫిర్యాదు చేశారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి మోక్షం

● మొదటి విడతగా రూ.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
● గడివేములలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గడివేములలో ట్రాఫిక్ జామ్



సీఎం చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న గౌరు దంపతులు (ఫైల్)

గడివేముల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలు, ఇరుకైన రహదారితో గడివేముల మండల కేంద్రంలో నిత్యం వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. గడివేములలోని మలుపుల వద్ద తిరగలేక రోడ్డుపై నిలిచి పోతుండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యేవారు. వాహన చోదకులు అతి వేగంతో రావడంతో గతంలో నలుగురు మృత్యువాత పడ్డారు. ఏళ్ల నుంచి గడివేముల మండల ప్రజలను ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నా గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గడివేముల మండల కేంద్రంలో ప్రజలు, ప్రజా సంఘాలు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసి అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. అయిన సమస్య పరిష్కారం కాలేదు. టీడీపీ మండల నాయకులు గడివేముల ట్రాఫిక్ సమస్యను గౌరుచరిత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె గత ఎన్నికల ప్రచారంలో గడివేములకు బైపాస్ రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నికల హామీల అమలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరువెంకటరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి పాణ్యం నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. అలగనూరు రిజర్వాయర్ కుంగిన ప్రాంతాన్ని మరమ్మతులు చేయాలని, గడివేములలో బైపాస్ రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. దీంతో సీఎం సానుకూలంగా స్పందించి అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.34 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఫిబ్రవరి 28న గడివేముల బైపాస్ రోడ్డు భూసేకరణకు, సర్వే చేయడానికి మొదటి విడతగా రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. 22.25 ఎకరాల్లో మూడు కిలోమీటర్ల గడివేముల బైపాస్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గడివేముల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గడివేముల బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరుచరిత ప్రత్యేక చొరవ చూపి మొదటి విడతగా రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించడంపై టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సీతారామిరెడ్డి, సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడివేముల బైపాస్ రోడ్డు నిర్మిస్తామని గౌరు చరిత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఆ మేరకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మొదటి విడతగా రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే గౌరుచరిత అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.34 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. బ్రాహ్మణపల్లె నుంచి గడివేములకు డబల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాష, షన్ముఖరెడ్డి, గణేష్‌రెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, శ్రీనివాసయాదవ్, కంది శ్రీనివాసులు, గిరిబాబు, జయప్రకాష్‌రెడ్డి, సుభద్రమ్మ పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా తెప్పోత్సవం



తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం జరుపుకొన్న ఆదిదంపతులు మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవికి శనివారం రాత్రి వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో యర్రమల్ల మధు, గాయత్రి దంపతులతో పాటు దాతలు పాల్గొన్నారు.

ముగిసిన ఎద్దుల పోటీలు

మహానంది, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు శనివారం ముగిశాయి. పల్నాడు జిల్లా సంతమంగలూరుకు చెందిన వజ్రాల తేజశ్రీ రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచినట్లు రైతు కమిటీ అధ్యక్షుడు కొప్పుల శివనాగిరెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు రెండో స్థానంలో, గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కొప్రవూర్ గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా కొత్తపల్లికి చెందిన వెంకట హారిక ఎద్దులు నాలుగో స్థానంలో, జూటూరు రామకృష్ణారెడ్డి, షేక్ ఖరీముల్లా కంబైన్డ్ ఎద్దులు ఐదో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విజేతలైన ఎద్దుల యజమానులకు కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి చేతుల మీదుగా శనివారం రాత్రి బల ప్రదర్శన క్రీడామైదానంలో బహుమతులు అందజేశారు. మొదటి ఐదు బహుమతులు రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు రైతు కమిటీ సభ్యుల తరుపున అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు, నాయకుడు చంద్రమౌళీశ్వరరెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్, టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, గని చిన్న రంగస్వామి, నందిపల్లి మహేశ్వరరెడ్డి, ఉమాదేవి, చెన్నయ్య, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కొత్తూరులో న్యాయాధికారుల పూజలు

పాణ్యం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆదోని న్యాయాధికారి పేజీ సుధ, హిందూపురం జిల్లా న్యాయాధికారి శైలజ, కదిరి అదనపు న్యాయాధికారి జయలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయాధికారులకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికి అభిషేకాలు. అర్చనలు చేయించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ శర్మ ఉన్నారు.

విద్యార్థుల నిరసన

సున్నిపెంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో భోజనం సరిగా ఉండడం లేని విద్యార్థులు శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ చాంబర్ ముందు నిరసన తెలిపారు. అరటి పండ్లు ఇవ్వడం లేదని, పదో తరగతి విద్యార్థులకు 6.30 గంటలకు అన్నం పెట్టి రాత్రి 10.30 వరకు చదువుకోవాలని నిబంధన పెడుతున్నారని, కుల్లిపోయిన కూరగాలనే వండుతున్నారని చెప్పారు. బాత్రూంలలో నీరు రావడం లేదన్నారు. ప్రిన్సిపాల్ అమృతకుమార్‌ను వివరణ కోరగా విద్యార్థులకు భోజనం బాగానే పెడుతున్నామని చెప్పారు. అరటి పండ్లు కాంట్రాక్టర్ సరఫరా చేయడం లేదని, ఈ విషయం ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకుని వెళ్లామని చెప్పారు.

బస్సు, కారు ఢీ

సున్నిపెంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ముఖద్వారం వద్ద శనివారం బస్సు, కారు ఢీకొన్నాయి తెలంగాణ ప్రాంతం నుంచి శ్రీశైలం వస్తున్న కారు, ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సున్నిపెంట వైపుకు వెళ్తుండగా ముఖద్వారం వద్ద ఢీకొన్నాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు దర్యాపు చేస్తున్నారు.

ఓంకార క్షేత్రంలో ముగిసిన ఉత్సవాలు



బండిఆత్మకూరులో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

బండిఆత్మకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవ క్షేత్రాల్లో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. శనివారం ఓంకారంలో ఉషఃకాలంలో అర్చకులు గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పల్లకిలో స్వామివార్లు బండిఆత్మకూరు చేరుకోగానే గ్రామస్థులు మేళతాళాల వాయిద్యాలతో స్వాగతించి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే శిష్ణనందీశ్వర, పార్వతీ దేవి స్వామి వార్లు పల్లకిలో కొలువు దీరి బీ కోడూరు గ్రామం చేరుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, డాక్టర్ భరద్వాజశర్మ, శివయ్య, పల్లె వెంకటరామిరెడ్డి, బాలుడు, చలమయ్య పాల్గొన్నారు.

దుర్గా భోగేశ్వర స్వామి ఆలయంలో..

గడివేముల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో శనివారం నిర్వహించిన పారువేటతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రథమ కోనేర్లలో అవభృత స్నానాలను చేయించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలు నంది వాహనంపై గడిగరేవుల గ్రామానికి చేర్చి పారువేట నిర్వహించారు. శివరాత్రి మహోత్సవాల్లో భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

● దుర్గాభోగేశ్వర ఆలయంలో శనివారం సేవా కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులు చెల్లించిన ముడుపులను లెక్కించారు. హుండీలలో భక్తులు చెల్లించిన ముడుపులు రూ.1,68,813, టికెట్ కొనుగోలు ద్వార రూ.99,960, స్వామి వారికి కల్యాణం చదివింపులు రూ.50,371, తాత్కాలిక షాపుల ద్వార రూ.30,250 వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కొత్తపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద గుమ్మడాపురంలో కొండం అశోక్ అనే వ్యక్తిని కులం పేరుతో దూషించినందుకు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు. వివరాలివీ.. గత నెల 18న గుమ్మడాపురం గ్రామ పొలిమేరలోని ఆటో శ్రీనివాసులు మినుము చేనులో అదే గ్రామానికి చెందిన కొండం అశోక్ మేకలు మేపుకుంటున్నారు. పొలంలో మేకలు మేపరాదని ఇదే గ్రామానికి చెందిన జడ్.వెంకటేశ్వరరెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగి వెంకటేశ్వరరెడ్డి అశోక్‌ను కులం పేరుతో దూషించి కాళ్లతో, చేతులతో దాడి చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ కేశవ తెలిపారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయండి

● ఇంటర్ విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ

వెలుగోడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా రాయాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సూచించారు. శనివారం ఆమె వెలుగోడు పట్టణంలోని ఏపీమోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు ఎలా రాశాలంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు ఎలా రాయాలో ఆమె పలు సూచనలు ఇచ్చారు. పరీక్షలు బాగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధిస్తామని విద్యార్థులు ఆమెకు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

30 వరకు ఉచితంగా టీకాలు: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 1నుంచి 30వరకు గాలికుంటు వ్యాధి టీకాలు ఉచితంగా వేయనున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవిందునాయక్, ఇతర పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం వెబినార్

వ్యవసాయం, గ్రామీణశ్రేయస్సు అంశంపై శనివారం నంద్యాల కలెక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెబినార్ కార్యక్రమం జరిగింది. లీడ్ జిల్లా మేనేజర్ రవీందర్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు, రైతులు పాల్గొన్నారు. వర్చువల్ విధానం ద్వారా పీఎం మోదీ మాట్లాడారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు సంస్థాగత రుణాల లభ్యతను పెంచడం, సవరించిన వడ్డీ రాయితీ పథకం, ఎంఐఎస్ఎస్ పథకం ముఖ్య లక్ష్యాలు, చిన్న, సన్నకారు రైతుల ఉత్పత్తులపై, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు ఉపశమనం కలిగించడానికి, పునర్వ్యవస్థీకరణ అంశాలపై రైతులకు, అధికారులకు అవగాహన కల్పించారు.

ఘనంగా వైజ్ఞానిక ప్రదర్శన

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాఅకాడమీ పాఠశాలలో నేషనల్ సైన్స్‌డేను పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ ఈవో శంకర్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం అద్భుతమైన ప్రదర్శనలు ఏర్పాటు చేసిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు బహుమతులు అందజేశారు.

నేడు భక్తకన్నప్ప గురుకులం వార్షికోత్సవం

కొత్తపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని గోకవరంలో భక్తకన్నప్ప గురుకులం చెంచు బాలుర ఆవాసం 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆవాస కమిటీ అధ్యక్షుడు కోట్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి మాయలూరు రఘురాములు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విశిష్ట అతిథిగా కాకనూరు శారదామఠంపీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ హాజరు కానున్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని 15 వార్డు గోపాల్‌నగర్‌లో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, వి. రామచంద్రారావు, వార్డు ఇన్‌చార్జి ఎబ్‌నైజర్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీంద్ర, నందిమూరినగర్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, హోటల్ రవి తదితరులు ఉన్నారు.

'ప్రజలపై అప్పుల భారం మోపేలా బడ్జెట్'

నందికొట్కూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు అప్పులు చేయాలని నిర్ణయించడాన్ని బట్టి చూస్తే ప్రజలపై భారాన్ని మోపేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నియోజకవర్గ సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. నాయకులు పక్కీర్ సాహెబ్, నాగమణి, గోపాలకృష్ణ, కర్ణ, బెస్త రాజు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై అదనపు భారం మోపేలా ఉందని సీపీఎం నాయకులు ఆరోపించారు. మాయమాటలతో గెలిచి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకే చెల్లుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ క్యాదర్శి వర్గ సభ్యులు నరసింహ, కె మహ్మద్ గౌస్, పి. వెంకటలింగం, తోట మద్దులు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో శనివారం నూనెపల్లె-కోవెలకుంట్ల కూడలిలో ఆ పార్టీ రాస్తారోకో నిర్వహించారు.

'యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి'

ఆత్మకూరురూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఐటీడీఏ శ్రీశైలం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ అధికారి ధనుంజయ సూచించారు. శనివారం ఆత్మకూరు మండల ఉద్యావన అధికారిణి చందన ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ శివార్లలోని మామిడి తోటలో మామిడి రైతులకు పూత, పింద దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌలు రైతు సంఘం అధ్యక్షుడు అష్రఫ్ వలి, ఎంపీఈవో ముర్తుజావలి, బీఏఐఎఫ్ ఎస్జీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేంద్ర,వెంకటేష్ నాయక్, మండల మామిడి రైతులు పాల్గొన్నారు.

ప్రజల అస్వస్థతపై పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న బుడ్డా శైలజ

ఆత్మకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని 5వార్డులో గల నీలితొట్లవీధిలో ఇద్దరు మృతిచెందడంతో పాటు మరో ఆరుగురు అస్వస్థతకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నీటి శాంపిళ్లను రీజనల్ ల్యాబ్‌కు పంపించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు నేతృత్వంలో నీలితొట్లవీధికి సరఫరా జరిగే అన్ని పైపులైన్లతో పాటు ప్రతి ఇంటి కొళాయిలను పరిశీలించారు. పారిశుధ్య చర్యలను చేపడుతున్నారు. రెండో రోజు కూడా కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రజారోగ్య విభాగం రీజనల్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి రెండు రోజుల పాటు ఆత్మకూరులోనే ఉంటూ అనుమానాస్పద మరణాలపై విచారిస్తున్నారు. ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా కాలనీవాసులకు శుద్ధ జలాలను అందిస్తున్నారు.

బాధితులకు బుడ్డా శైలజ పరామర్శ

మృతిచెందిన బాధిత కుటుంబాలతో పాటు అస్వస్థతకు గురైన వారిని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సతీమణి బుడ్డా శైలజ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలపడంతో పాటు అవస్థతకు గురైన వారికి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు కలీముల్లా, నాయకులు రామ్మూర్తి, షాబుద్దీన్, ఖాజామొహిద్దీన్, గౌస్ ఆజం ఉన్నారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మార్చి 17వతేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. శ్రీ రామకృష్ణా పీజీ కళాశాల ఆడిటోరియంలో శనివారం పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో డీఈవో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 130 కేంద్రాలలో 25, 542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, అందులో 16 ఎయిడెడ్ పాఠశాలల నుంచి 599 మంది, 6 బీసీ వెల్ఫేర్ పాఠశాలల నుంచి 427 మంది, 12 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1,537 మంది, 5 ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి 92 మంది, 27 కెజిబివిల నుంచి 1025 మంది, 4 మున్సిపల్ హైస్కూళ్ల నుంచి 425 మంది, 20 మోడల్ స్కూల్స్ నుంచి 1745 మంది, 173 ప్రైవేట్ పాఠశాలల నుంచి 8747 మంది, 6 సోషల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి 461 మంది, 7 ట్రైబల్ పాఠశాలల నుంచి 274 మంది, 182 జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 10210 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల పట్ల సీఎస్‌లు, డీవోలు ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఒకరోజు ముందుగానే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఫర్నీచర్, మంచినీరు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలను ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసి పూర్తి సమాచారంతో ఉండాలని, ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పరీక్షల విభాగం జిల్లా కో ఆర్డినేటర్ మహబూబ్‌బేగ్, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఈవోలు శంకర్‌ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

గరుడ విగ్రహాన్ని ఆవిష్కరించిన పీఠాధిపతి


గరుడ విగ్రహానికి పూజలు చేస్తున్న అహోబిల మఠం పీఠాధిపతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో నూతనంగా నిర్మించిన గరుడ విగ్రహాన్ని అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ శనివారం ఆవిష్కరించారు. మొదటగా శిష్య పరివార సమేతంగా అహోబిలం చేరుకున్న 46వ పీఠాధిపతికి ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి మాల, గంధం, పరివట్టములతో ఘనంగా సత్కరించారు. ఆళ్లగడ్డకు చెందిన ప్రముఖ యోగా టీచర్ ఎర్రం వెంకటాద్రి, ఎర్రం భాగ్యలక్ష్మి సహకారంతో ఏర్పాటు చేసిన గరుడ విగ్రహం వద్ద పీఠాధిపతి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వారిని పీఠాధిపతి పట్టువస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్, మణియార్ సుదర్శన్, వైకుంఠం స్వామి, మధుసూదన్, జనరల్ మేనేజర్ మురళీధరన్, విద్యుత్‌శాఖ ఏడీఈ రవికాంత్ చౌదరి పాల్గొన్నారు.

30,126 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి


చాగలమర్రిలో గృహాలను పరిశీలిస్తున్న పీడీ హరిగోపాల్

చాగలమర్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 59,255 పక్కా గృహాలకు గాను 30,126 పక్కాగృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్ తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేస్‌మెంట్‌లు, వివిధ దశల్లో ఉన్న గృహాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 4,772 గృహాలు మార్చి చివరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం ఉందని అన్నారు. పీఎంఏవై కింద జిల్లాలో 12,689 గృహాలు మంజూరు కాగా 2,903 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు గృహాలు పూర్తి చేసుకోకపోతే రద్దు అవుతాయన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ నరసింహ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఇంజనీరింగ్ సహాయకులు కృష్ణనాయక్, డేటా ఆపరేటర్ సలీమ్, లబ్ధిదారులు ఉన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

చాగలమర్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్. ఈ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉపవాస దీక్షలతో నెల రోజుల పాటు జరుపుకుంటారు. ఆదివారం నుంచి రంజాన్ నెల ప్రారంభమవుతున్నట్లు ప్రభుత్వ ఖాజీ యూనస్ తెలిపారు. చాగలమర్రి గ్రామంలోని 500 ఏళ్ల చరిత్రగల జామియా, అరబ్, ఖిల్లా తదితర మసీదులను విద్యుత్‌బల్బులతో, రంగులతో, చలువ పందిర్లతో ముస్తాబు చేశారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఉపవాస దీక్షలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో దుకాణాల్లో వస్తువుల కొనుగోలు సందడి కనిపించింది.

యాగంటిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


యాగంటి క్షేత్రంలో శివదీక్ష విరమిస్తున్న స్వాములు

బనగానపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు 5వ రోజున శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం నిర్వహించారు. సాయంత్రం ధ్వజ అవరో హ ణ కార్యక్రమంలో ఈవో చంద్రుడు, బండి మౌళీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివదీక్ష విమరణ

యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివదీక్ష విరమణ కార్యక్రమం శనివారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది శివస్వాములు ఇరుముడిని విప్పి ఉమామహేశ్వరస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి యాగంటిలో శివదీక్ష విరమించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణంలో పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం కావడంతో ప్రముఖులకు ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా మాలిక్ బాబా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

డోన్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని రామచంద్ర మాలిక్ బాబా దేవస్థాన్ సంస్థాన్ కమిటీ ఆధ్వర్యంలో శని వారం సాయంత్రం మాలిక్ బాబా రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. రామచంద్ర మాలిక్ బాబా ఆలయం నుంచి పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం వరకు రథాన్ని లాగారు. భక్తులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే వెండి ఆభరణాలను కానుకలు అందజేశారు. మాలిక్‌బాబా సంస్థాన్ కమిటి చైర్మన్ ఆలా రామకృష్ణ, కమిటీ సభ్యులు సేవకుల ఆధ్వర్యంలో ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.85 లక్షలు

బేతంచెర్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.85 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దాతలకు స్వామి, అమ్మవార్లతీర్థ ప్రసాదాలు అందజేశారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఈద్గానగర్‌లో పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదిక పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఈద్గానగర్ కాలనీలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను, ఆస్థానం వద్ద జరుగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్లు పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె పట్టణాన్ని అత్యంత సుందర పట్టణంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. జుర్రేరువాగులో మరుగునీరు కలువకుండా ప్రత్యామ్నాయంగా పట్టణంలో నిర్మిస్తున్న పనులను వేగవంతం చేయాలని కోరారు. పనుల విషయంలో నాణ్యతను పాటించాలని మంత్రి అధికారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఈవోఆర్డీ సతీశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పూల కలాం, నియాజ్, అమీర్‌జాన్, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మంత్రి అధికారులను కోరారు.

పింఛన్ల పంపిణీ

కూటమి ప్రభుత్వానికి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లలాంటివని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం నందివర్గం గ్రామంలో మంత్రి బీసీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోనే రూ.5.35 కోట్ల పింఛన్లు అందించామన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, శంకర్, ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టు చైర్మన్ జిలెళ్ల రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరావు, లాయర్ కేవీ సుబ్రహ్మణ్యం, రామతీర్థం మద్దిలేటి, అంగడిమాబూ, సీతారామయ్య జమాల్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, ఎంపీడీవో రమణ, ఏఈ సాయికృష్ణ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

మండలంలోని నందివర్గం గ్రామంలో గాలికుంటు వ్యాధి నియంత్రణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ పాడిరైతులు తమ పశువులకు గాలికుంటు టీకాను వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీ మారుతీసకారం, పశువైద్య డాక్టర్లు, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అహోబిలంలో బ్రహ్మోత్సవాలు

- సమన్వయంతో విజయవంతం చేయాలి
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో ఈ నెల 3నుంచి 18 వరకు జరగనున్న లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. అహోబిలం గ్రామంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులు, నిర్వాహకులతో శనివారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్శన సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వసతి తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. వాహనాల రాకపోక లకు అంతరాయం లేకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, పలువురు అర్చకులు, మఠం నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 1(ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారిశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిశాలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు వంటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో రాయలసీమకు తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా చేయడంతోపాటు పరిశ్రమల స్థాపనకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. వైసీపీని రానున్న రోజుల్లో ప్రజలు ఒక్క సీటుకు మాత్రమే పరిమితం చేస్తారని ఎమ్మెల్యే అన్నారు.

రైతుల నమ్మకాన్ని నిలబెడతాం: ఎమ్మెల్యే కోట్ల


చంద్రపల్లిలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ప్యాపిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైతుల నమ్మకాన్ని నిలబెడతామని, వచ్చే ఏడాది నాటికి నియోజవర్గంలోని అన్ని చెరువులకు నీరు నింపి సస్యశ్యామలం చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలోని చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు చెరువుకు నీరందించి ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరు అందించి సాగునీరు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. గుడిపాడులో పేదలకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. నాయకులు వై లక్ష్మీనారాయణ యాదవ్, రాజానారాయణమూర్తి, టి.శ్రీనివాసులు, ఖాజావీర్, చిన్నవెంకటరెడ్డి, ఓబులేసు, ఆదినాయణ, పుల్లయ్య, సుదర్శన్, కుమ్మరి సుధాకర్, రమణయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


డోన్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

కొలిమిగుండ్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక మోడల్‌స్కూల్ సెంటర్‌లో లాంగ్వేజీ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 169 మందికి గాను 161మంది విద్యార్థులు హాజరుకాగా, ఎనిమిది మంది గైర్హాజరైనట్లు పరీక్షల ముఖ్య అధికారి శ్రీనివాసరెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి రామయ్య తెలిపారు.

- **కోవెలకుంట్ల:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 249 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారు. అలాగే అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 203 మందికి గాను ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ రామలింగారెడ్డి, అధ్యాపకులు మద్దిలేటిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.
- **చాగలమర్రి:** చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి పరీక్షకు 341 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 317 మంది పరీక్షకు హాజరయ్యారని, 24 మంది గైర్హాజరయ్యారని పరీక్ష నిర్వహణ అధికారులు పెద్దన్న, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులేసు తెలిపారు. పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసిన బందోబస్తును ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ హరిప్రసాద్, ఏఎస్ఐ నబీసాహేబ్, పోలీసులు ఉన్నారు.
- **ప్యాపిలి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ తెలుగు పరీక్షకు 149 మందికి గాను 141మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఎనిమిది మంది గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.
- **డోన్ టౌన్:** డోన్ పట్టణంలో ఇంటర్ పరీక్షలు నాలుగు పరీక్ష కేంద్రాల్లో (ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, వెంకటేశ్వర జూనియర్ కాలేజీ, శ్రీసుధ జూనియర్ కాలేజీ) శనివారం నిర్వహించారు. మొదటి రోజున మొత్తం విద్యార్థులు 1272 మందికి గానూ 1256 మంది పరీక్షలు రాశారు. 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్లు ఓబుల్‌రావు, చంద్రమోహన్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు ఆనంద్, చాంద్‌బాషా పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జులైఖ

డోన్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జులైఖ డిమాండ్ చేశారు. శనివారం ఐసీడీఎస్ భవన ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కారం కోరుతూ ఈ నెల 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు ఏసమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలలో హుండీ చోరీ

శిరివెళ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శిరివెళ్లలోని అమ్మవారిశాలలో(వాసవీ కన్యకాపరమేశ్వరి) గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి అమ్మవారిశాల తలుపును విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లి రుద్రవరం రహదారిలోని వెంచర్‌లో వదిలేశారు. భక్తులు సమర్పించిన హుండీ కానుకలను అపహరించుకుని వెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చిన్న పీరయ్య ఘటనాస్థలానికి చేరుకుని సీసీ టీవీ ఫుటేజిని, దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

శిరివెళ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన పాడి రైతు షేక్ మాబుకు చెందిన పశువులపాక అగ్నికి ఆహుతైంది. శనివారం తెల్లవారుజామున పశువులపాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పాకలోని 14 పాడి గేదెలు అగ్నికీలకల్లో చిక్కుకుని ప్రాణాలు వదలగా మరిన్ని తీవ్రంగా గాయపడ్డాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ గేదెలు మృత్యువాతపడ్డాయి. కళ్లెదుటే మూగజీవాలు విగతజీవులుగా మారడంతో పాడి రైతు మాబు కన్నీటి పర్యంతమయ్యాడు. పశు పోషణ, పాడి పరిశ్రమతోనే జీవనం సాగిస్తున్నానని.. పాడి గేదెల మృతితో దాదాపు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్థిక సహకారం అందించాలని బాధితుడు షేక్ మాబు కోరారు. ప్రమాద ఘటన స్థలాన్ని తహసీల్దార్ పుష్పకుమారి, వీఆర్వో చెన్నయ్య, పశుసంవర్ధకశాఖ అధికారులు మనోరంజన్ ప్రతాప్, శ్రీనివాసులు పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బర్డ్‌ఫ్లూపై ఆందోళన అవసరం లేదు

- పశుసంవర్థక శాఖ ఏడీ వరప్రసాద్



చాగలమర్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూపై ఆందోళన అవసరం లేదని, చికెన్ తిన వచ్చని పశు సంవర్థకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో వైద్యులు కూడా పరీక్షలు జరిపి చికెన్ తినవచ్చని ప్రకటించారన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: బర్డ్‌ఫ్లూ వ్యాధి అంటే ఏమిటి?

జవాబు: ఏవీఎస్ ఇన్‌ఫ్లూ ఏంజా అనే వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఇది ప్రధానంగా కోళ్లు, బాతులకు వస్తుంది. మన దేశంలో మొదటిసారి 2006లో గుర్తించారు. ప్రస్తుతం గోదావరి జిల్లాలో ఈ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న నివారణ చర్యల వల్ల వైరస్ వ్యాప్తి చెందడం లేదు.

ప్రశ్న: కోళ్లలో వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి?

జవాబు: కోళ్లకు ఈకలు చెల్లా చెదురు అవుతాయి. గుడ్ల ఉత్పత్తి తగ్గిపోతోంది. శరీర అవయవ పనితీరు సరిగా ఉండదు. వ్యాధి తీవ్రతరమైతే 48 గంటల్లోపు కోళ్లు చనిపోతాయి.

ప్రశ్న: ఈ వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుంది?

జవాబు: వైరస్ సోకిన కోళ్ల ద్రవాలు, విసర్జనల ద్వారా కలుషితమైన ఆహారం నీటి ద్వారా, అలాగే బర్డ్‌ఫ్లూవ్యాధితో మృతి చెందిన కోళ్లను సమీపంలో ఉంచడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

ప్రశ్న: మనుషులకు ఎలా సోకుతుంది?

జవాబు: వైరస్ సోకిన కోళ్లతో ప్రత్యక్షంగా ఉండటం, కోళ్ల ఉత్పత్తులను సరైన విధంగా శుభ్రం చేయకపోవడం వల్ల వ్యాధి మనుషులకు సోకుతుంది. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ప్రశ్న: వ్యాధి ఎలా నివారించవచ్చు?

జవాబు: శుభ్రంగా ఉడికిచిన చికెన్, గుడ్డు తినడం సురక్షితం. బర్డ్‌ఫ్లూ వైరస్ 70 సెం.గ్రేడ్‌ల ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో నశిస్తుంది. మాంసాన్ని తాకిన తరువాత చేతులను సబ్బుతో కడుక్కోవడం, వండే సమీపంలో పరిశుభ్రత పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకొని చికెన్, గుడ్లు తినచ్చు.

అందరూ కలిసి అడవిని కాపాడాలి

చాగలమర్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సిద్ధం కావాలని ఎఫ్‌వో రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో డీఎఫ్‌వో ఆదేశాల మేరకు జానపద గేయాల కళాకారుడు ప్రతాప్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. అడవికి నిప్పు పెట్టరాదని, చెట్లను నరక వద్దంటూ ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది నగేష్, సుభాష్, నర్సయ్య, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవాలి


కొలిమిగుండ్లలో అమరులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొలిమిగుండ్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వర్గీకరణ సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగేశ్వరరావు మాదిగ అన్నారు. శనివారం కొలిమిగుండ్ల దండోరా కార్యాలయంలో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలదస్తగిరి, నాగపుల్లయ్య, రామచంద్రుడు, శీను, మారెన్న, రామప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: ఎమ్మార్పీఎస్ జాతి కోసం అమరులైన వారి త్యాగాలను ఎప్పటికీ మరిచిపోదని ఎంఎస్‌పీ నాయకుడు గూండాల ఈశ్వరయ్య మాదిగ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పులికేశయ్య, చిన్నరాముడు, కోసన పల్లె రామాంజనేయులు, పులి పెద్దయ్య, బాలకేశవులు, గుండ్లకొండ రంగన్న,రాము, చక్రవర్తి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

చాగలమర్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.మహబూబ్‌బాష, మండల అధ్యక్షుడు మస్తాన్‌బాష, కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. శనివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ, ఐఆర్ అమలు కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో స్పష్టత ఇవ్వలేదన్నారు. గత ఏడాది పాఠశాల విద్యకు 10.15 శాతం నిధులు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో 9.86 శాతం మాత్రమే నిధులు కేటాయించిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, తల్లికి వందనం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేషప్ప, మాబుహుసేన్, మహబూబ్‌బాష, ప్రసాద్ శాస్త్రి, ఉస్మాన్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి పల్లకి ఉత్సవం

చాగలమర్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు శనివారం పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా గోవిందనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో పూజలు

రుద్రవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామ సమీపంలోని దొర్ని, గుట్టకొండ, నరసాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి అమ్మవార్లకు, అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సృజనాత్మకతను పెంచుకోవాలి


విద్యార్థినులతో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే సృజనాత్మకతను పెంపొందించుకోవాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం బనగానపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలికలతో ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి తిలకించారు. హెచ్ఎం గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులను అభినందించారు.